ప్రజాశక్తి

గురువారం 27 నవంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వార్తలు 5లో..



విశాఖలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

లేబర్ కోడ్స్‌పై నిరసనల వెల్లువ

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో భారీ కార్మిక ప్రదర్శనలు, మానవహారాలు



అనకాపల్లిలో నినదిస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ఐటిఐ అభ్యర్థులకు ఆర్‌టిసి నియామకాలు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్ : డీజిల్ మెకానిక్, వెల్డర్, పెయింటర్ ట్రేడుల్లో ఎంపికైన 12 మంది ఐటిఐ అభ్యర్థులకు, ఏపీఎస్ఆర్టీసీ విశాఖ జిల్లాకు సంబంధించి వివిధ డిపోల్లో అప్రెంటిస్ నియామక పత్రాలను ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు బుధవారం జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అప్రెంటిస్ అభ్యర్థి, పూర్తి అంకిత భావంతో, అప్రెంటిస్‌షిప్ పూర్తి చేయాలన్నారు. అప్రెంటిస్‌లుగా నియామకం పొందిన అభ్యర్థులకు నెలకు రూ.9,600 ఉపకార వేతనం ఇవ్వ బడునని తెలిపారు. బస్సుల నిర్వహణ ఎప్పటికప్పుడు చేస్తూ, మంచి కండిషన్‌తో బస్సులను నడుపుటకు, ఐటిఐ పూర్తి చేసిన అభ్యర్థులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించుటకు ఐటిఐ ఇన్స్టిట్యూట్‌ల ద్వారా అభ్యర్థుల వివరాలను సేకరించి వారిని తమ తమ డిపోల్లో నియమించుకోవాలని డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఎ.గంగాధరరావు, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) జి.శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ (పర్సనల్) బి.వి.రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగేశ్వరరావు

'మేఘాద్రి గెడ్డ'ను జివిఎంసికి అప్పగించేలా ప్రతిపాదనలు

ఎపి శాసన సభ అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : క్షేత్రస్థాయి పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా ఉండే అంచనాలతోనే సత్ఫలితాలు సాధించగలుగుతామని ఎపి శాసన సభా అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్‌ను జివిఎంసికి అప్పగించేలా ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం విసి హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, రూపొందించిన అంచనాలు, వ్యయం తదితర అంశాలపై కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా అధికారులతో మిగతా 2లో..

మోడల్ స్కూల్‌ను ఆశ్రమ పాఠశాలగా మార్చాలి

వార్త 8లో..

ధాన్యం కొనుగోలు కేంద్రాలేవీ?

వార్త 4లో..

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

వార్త 3లో..

28 నుంచి ఆర్థోడాంటిక్ సమావేశాలు

ముఖ్య అతిథులుగా పలువురు హాజరు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖలో 59వ ఇండియన్ ఆర్థోడాంటిక్ సమావేశాలు ఈనెల 28 నుంచి 30 వరకు విశాఖలోని రాడిషన్ బ్లూ హొటల్ లో జరగనున్నాయని ఇండియన్ ఆర్థోడాంటిక్ కాన్ఫరెన్స్ నిర్వాహక కమిటీ చైర్మన్ శ్రీకృష్ణ చలసాని తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 28 న సాయంత్రం 5 గంటలు రాడిసన్ బ్లూ రిసార్ట్స్‌లో జరిగే జాతీయ 59వ ఇండియన్ ఆర్థోడాంటిక్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు,

ఇండియన్ ఆర్థోడాంటిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పునీత్ బాత్రా

తెలంగాణ ఎమ్మెల్యే డాక్టర్ కె.రాజేష్ రెడ్డి,ఇండియన్ ఆర్థోడాంటిక్ సొసైటీ గౌరవ కార్యదర్శి డాక్టర్ సంజయ్‌లాభ్ హాజరవుతారని తెలిపారు. ప్రపంచవ్యాప్తం గా ఉన్న ప్రముఖ ఆర్థోడాంటిక్ నిపుణులను ఒకచోట చేర్చి,నూతన పద్ధతును అన్వేషించడానికి, మెరుగుపరచడానికి, అధునాతన పరిశోధనలను పంచుకోవడా నికి, రోగి సంరక్షణలో కొత్త సరిహద్దులను ప్రేరేపించడం లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అఖిల భారత ఆర్థోడాంటిస్టులు, విద్యావేత్తలు, అభ్యాసకులు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేట్లు, ప్రఖ్యాత వక్తలు ఈ సమావేశాలకు హాజరవుతున్నారని తెలిపారు. మీడియా సమావేశంలో సమావేశంలో ఆర్గనైజింగ్ కో చైర్మన్ డాక్టర్ డి.ఎస్.రాజు,డాక్టర్ కె.విజయ్ కుమార్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.ఎస్.రాజు, కోశాధికారి డాక్టర్ గోరంట్ల సురేష్,సైంటిఫిక్ కమిటీ కో కన్వీనర్ డాక్టర్ అనిల్ చీరాల,డాక్టరు రవీంద్ర వంగల పాల్గొన్నారు.

ఉత్సాహం.. ఉత్తేజం

అలరించిన ఎయు స్టూడెంట్స్ ఫెస్ట్



ఫెస్ట్‌కు భారీగా హాజరైన విద్యార్థులు



డ్యాన్సులతో ఆకట్టుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలో మూడు రోజుల పాటు తలపెట్టిన ఎయు స్టూడెంట్స్ ఫెస్ట్ రెండో రోజైన బుధవారం అశేష జన సందోహం మధ్య సాగింది. ఈ ఫెస్ట్‌ను ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఎస్ఎఫ్ఐ తలపెట్టింది. కాగా, యూనివర్సిటీలోని ఓపెన్ ఎయిర్ థియేటర్ వేదికగా ఈ సాంస్కృతిక ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఈ ఫెస్ట్‌లో ముఖ్యంగా విద్యార్థులు వారి సాంస్కతిక ప్రతిభను చాటుకున్నారు. వేల సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు ఈ కళా ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఫెస్ట్ తొలిరోజైన మంగళవారం ఎయు రెక్టార్ ప్రొఫెసర్ పులిపాటి కింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవిఆర్.రాజు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. విజయ మోహన్ పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, ఉపాధ్యక్షులు ఎల్‌జె.నాయుడు హాజరయ్యారు. రెండో రోజు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ఎస్.హరినాథ్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.సీతామాణిక్యం మాట్లాడారు. 'విద్యార్థులు కేవలం విద్యా రంగంలోనే కాకుండా, సాంస్కృతిక రంగంలోనూ వారి ప్రతిభను కనబరచాలని ఉద్ఘాటించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి మిగతా 2లో..

పన్నులు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: జివిఎంసి పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను, నీటి చార్జీలను సకాలంలో చెల్లించి విశాఖ నగర అభివృద్ధికి భవన యజమానులు సహకరించాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని భవన యజమానులు, ఆస్తి ఖాళీ స్థలాల పన్నులను 2025-26 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తిపన్ను, ఖాళీస్థలం పన్ను బకాయిలు, మంచి నీటి కుళాయి చార్జీల బకాయిలను వెంటనే చెల్లించాలని కమిషనర్ తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని యెడల బకాయిదారుల ఆస్తులు జప్తు చేయబడునని కమిషనర్ తెలిపారు. కావున భవన యజమానులందరూ తక్షణమే మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కు చెల్లించవలసిన ఇంటి పన్ను, ఖాళీస్థలము పన్ను, మంచి నీటి కుళాయి చార్జీలను సకాలములో చెల్లించి, ఆస్తి జప్తులకు, వడ్డీలకు గురికాకుండా పన్నుల బకాయిలను వెంటనే చెల్లించాలని భవన యజమానుదారులకు కమిషనర్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

'మేఘాద్రి గెడ్డ'ను జివిఎంసికి అప్పగించేలా ప్రతిపాదనలు

కలిసి చర్చించినట్లు తెలిపారు. అలాగే మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఉందని, దానికి మరమ్మతులు చేపట్టి జివిఎంసికి అప్పగించేందుకు అనుగుణంగా ప్రతిపాదనలు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. సభ్యులు పలు అంశాలపై సలహాలు, సూచనలతో పాటు ప్రాజెక్టుల వ్యయం, అంచనాల రూపకల్పన తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలిపారన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెద్దయెత్తున పలు కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని ప్రజలకు చేరువ చేసేలా అధికారులు కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

కమిటీ సభ్యులు వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వం కొన్ని లక్ష్యాలతో ఏ బడ్జెట్ అలకేషన్ చేసిందో, ఆయా డిపార్ట్‌మెంట్ల వారీగా రివ్యూ చేస్తూ, ఆ లక్ష్యాలు చేరుకోగలిగామా ? లేదా ?.. ఆ లక్ష్యాలు చేరుకోవాలంటే భవిష్యత్తులో ఎలాంటి మౌలిక వసతులు కల్పించాలి, ఎలాంటి మార్పులు చేయాలనేదానిపై విభాగాల అధిపతులతో సమగ్రంగా సమీక్షించామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు వరుదు కల్యాణి, ఏలూరి సాంబశివరావు, నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, పి.సూర్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

ఉత్సాహం.. ఉత్తేజం

ఎంతగానో 'దోహదం చేస్తాయి' అని పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా యూనివర్సిటీ ఇలాంటి మరిన్ని ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ సమస్యలతో పాటు ఇటువంటి సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.వెంకటరమణ, అధ్యక్షులు జె.అజయ్, యూనివర్సిటీ కార్యదర్శి ఎం.కుసుమాంజలి, అధ్యక్షురాలు ఆర్.హర్షిత్‌తో పాటు సంజయ్, తరుణ్, సోమేశ్, ప్రగతి, నిఖిల్, మానస, సునీల్, సతీష్ వంటి యూనివర్సిటీ కమిటీ సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొని, తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులందరికీ యూనివర్సిటీ కార్యదర్శి ఎం.కుసుమాంజలి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సవాస్దీ కప్‌లో పతకాల పంట

- విశాఖ క్రీడాకారునికి స్వర్ణం, రజతం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : థాయిలాండ్‌లోని పటాయా వేదికగా ఈ నెల 21 నుండి 23 వరకు జరిగిన కిజునా ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ సవాస్దీ కప్ 2025 టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుడు, విశాఖ వాసి అయిన బివిఎస్‌కె. లింగేశ్వరరావు అద్భుత ప్రదర్శన కనబరిచారు. లింగేశ్వరరావు 55 ఏళ్ల విభాగంలో రెండు ముఖ్యమైన ఈవెంట్లలో పతకాలను సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. 55 మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో విభాగంలో మొదటి నుండి చివరి వరకు ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఫైనల్ మ్యాచ్‌లో అత్యంత ఉత్కంఠభరితంగా పోరాడి, తమ ప్రత్యర్థులపై గెలుపొంది విజేతగా నిలిచారు. ఈ విజయంతో ఆయన అత్యున్నతమైన స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. అంతేకాకుండా, 55 మెన్ డబుల్స్ విభాగంలో కూడా వారు అసాధారణమైన ప్రతిభను చూపారు. క్వార్టర్-ఫైనల్స్, సెమీ-ఫైనల్స్‌లో పటిష్టమైన ప్రత్యర్థులను ఓడించి ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. చివరి పోరులో హోరాహోరీగా పోరాడినప్పటికీ, రన్నరప్‌గా నిలవాల్సి వచ్చింది. అయినప్పటికీ, వారి పోరాట పటిమకు గుర్తింపుగా రజత పతకాన్ని దక్కించుకున్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ఒక స్వర్ణ పతకం, ఒక రజత పతకంతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, దేశ కీర్తిని ఇనుమడింపజేశారు. ఈ పోటీలలో మిక్స్డ్ డబుల్స్ భాగస్వామిగా సుజానే వింగ్లెట్, మెన్స్ డబుల్స్ భాగస్వామి కార్తికేయన్ వాసు ఆయన విజయంలో భాగస్వాములయ్యారు.

మహోన్నత వ్యక్తి మిరియాల

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: మహోన్నత వ్యక్తి మిరియాల అని జనసేన పార్టీ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ కొనియాడారు. దివంగత మిరియాల వెంకటరావు 86వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఉషాకిరణ్‌తో పాటు పసుపులేటి శేఖర్ మాట్లాడుతూ డిసెంబర్ 14 న నగరంలో వీఎంఆర్‌డీఎ బాలల ప్రాంగణంలో వేడుకలను నిర్వహిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పలువురు ప్రముఖులతో సన్నిహితంగా మెలగడంతో పాటు తనదైన శైలిలో సహాయ కార్యక్రమాలు నిర్వహించిన ఘనత మిరియాలకే దక్కుతుంద న్నారు. ఆయనపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని, ఆయన కుమారుడు సీనియర్ ఐఎఎస్ అధికారి మిరియాల శేషగిరిబాబు ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ఆ రోజు ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. ఆహ్వాన కమిటీ తరపున గంట్ల శ్రీనుబాబు, కె.వి.వి సత్యనారాయణ, జెర్రి పోతుల మోహన్ కుమార్ మిరియాల ఆశయ సాధనకు తామంతా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కోటిపోతుల శ్రీనివాస్, ఆకుల మురళి, సుబ్బు విశ్వనాథ్ తదితరులు జయంతి వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

ప్రశంసా పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని నియోజవర్గాల్లో ప్రతిభ ఆధారంగా ఎంపికైన 13 మంది విద్యార్థులకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రశంసా పత్రాలు, మెడల్స్ బహూకరించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలను కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిరప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమములో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్, ఉప విద్యాశాఖాధికారి ఎ.సోమేశ్వర రావు, మండల విద్యాశాఖాధికారులు, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు రిఫరీగా శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం డివిజన్‌లో పనిచేస్తున్న డాక్టర్ డివిఎస్‌వై. శర్మ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీలైన ఐదో ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ 2025కు రిఫరీగా ఆయన నామినేట్ అయ్యారు. రాజస్థాన్‌లోని ఏడు నగరాల్లో (జైపూర్, అజ్మీర్, ఉదయ్‌పూర్, జోధ్‌పూర్, బికనీర్, కోట, భరత్‌పూర్) ఈ నెల 24 నుండి డిసెంబర్ 5 వరకు ఈ మెగా క్రీడా ఈవెంట్ జరుగుతుంది. .శర్మ జోధ్‌పూర్‌లో ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు జరిగే టేబుల్ టెన్నిస్ పోటీలకు రిఫరీగా వ్యవహరించనున్నారు. ఆయన టేబుల్ టెన్నిస్ క్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సుదీర్ఘ అనుభవం నిపుణత కలిగి ఉన్నారు. ఆయన ప్రస్తుతం బ్లూబ్యాడ్జ్ ఇంటర్నేషనల్ అంపైర్‌గా గుర్తింపు పొందారు. విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా కూడా ఆయన సేవలందిస్తున్నారు.



శర్మ (ఫైల్ ఫొటో)

ఈ సందర్భంగా డా. డి.వి.ఎస్.వై.శర్మకు ఎల్ఐసి విశాఖపట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్ దాస్, పర్సనల్ మేనేజర్ డి.రామారావు, ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ వరప్రసాద్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు

8 మంది విద్యార్థులపై చర్యలకు సిఫార్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో జరుగుతున్న డిగ్రీ, పిజి పరీక్షల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని దూర విద్య సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. బుధవారం ఎయు నుంచి కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ కళాశాలకు ఆకస్మిక తనిఖీకి వెళ్లిన ఎయు అధికారులతో కూడిన స్క్వాడ్ బందానికి ఎనిమిది మంది విద్యార్థులు పట్టుబడ్డారు. వీరిపై తదుపరి చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగానికి నివేదిక పంపుతున్నారు. వీరిలో ఏడుగురు విద్యార్థులు చూచి రాతకు పాల్పడగా, ఒక విద్యార్థి బదులు మరొకరు పరీక్ష రాస్తున్నట్లు గుర్తించారు. ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాయడంపై అధికారులు తక్షణం చర్యలు కోసం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీరిపై విశ్వవిద్యాలయం పరంగా తదుపరి చర్యలు తీసుకోవడానికి నిర్ణయించారు. పరీక్షలు నిరంతర పర్యవేక్షణలో జరుగుతాయని, విద్యార్థులు ఎవరు ఎటువంటి చూచిరాతలకు, అనైతిక చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను నిరంతరం గమనించాలని కోరారు. పరీక్షల్లో ఇటువంటి అనైతిక చర్యలకు పాల్పడిన తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షునిగా చిన్నబాబు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షునిగా కాకినాడ చిన్నబాబు నియమి తులయ్యారు. బుధవారం ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అడ్డాల వెంకటవర్మ నియామకపత్రం ఆయనకు అందించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా పార్టీలో వివిధ హోదాల్లో సేవలందిస్తున్నానని, జిల్లా ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తన మీద పెట్టిన బాధ్యతను గౌరవిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

రైల్వే స్టేషన్‌లో అత్యాధునిక డిస్‌ప్లే స్క్రీన్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తూర్పు కోస్తా రైల్వే పరిధిలోని వాల్తేరు డివిజన్ విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సమాచారం అందించేందుకు, స్టేషన్ వాతావరణాన్ని మెరుగుపరిచేందుకు ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. కొత్త వాణిజ్య ప్రకటనల ఒప్పందంలో భాగంగా స్టేషన్‌లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన 220 డిజిటల్ ఎల్ఇడి డిస్‌ప్లే స్క్రీన్‌లను ఏర్పాటు చేసింది. ఈ కొత్త డిజిటల్ డిస్‌ప్లే వ్యవస్థను వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా బుధవారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో లాంఛనంగా ప్రారంభిం చారు.కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్ కుమార్, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ పూజ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో అక్కాతమ్ముళ్ల సత్తా

ప్రజాశక్తి. చింతపల్లి: కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్‌లో చింతపల్లి ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాల (ఇఎంఆర్ఎస్) విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో సత్తా చాటారు. స్వర్ణ, రజత పతకాలను సాధించి పాఠశాల ప్రతిష్టను ఇనుమడింపజేశారు. జియు-జిట్సు ఆరవ ఏపి స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా 'స్పెరింగ్' విభాగంలో హోరాహోరీగా సాగిన పోటీల్లో అక్కాతమ్ముళ్లు సత్తా చాటారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని పాడి జాస్విని కష్టప్రియ, అండర్-14 విభాగంలో 50 కేజీల బరువు కేటగిరీలో అద్భుతమైన పోరాట పటిమతో మొదటి స్థానం దక్కించుకుని స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

జాస్విని తమ్ముడు ఆరో తరగతి విద్యార్థి పాడి లోహిత్ కృష్ణ, అండర్-12 విభాగంలో 30 కేజీల కేటగిరీలో ద్వితీయ స్థానం పొంది రజత పతకాన్ని సాధించాడు. వీరిద్దరూ ఒకే టోర్నమెంట్‌లో పతకాలు సాధించి చింతపల్లికి కీర్తి తెచ్చారు. రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రదర్శన చేసిన విద్యార్థులు ఇప్పుడు నేరుగా జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. త్వరలో ఉత్తరాఖండ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

విశాఖ కలెక్టరేట్ : భారత రాజ్యాంగ దినోత్సవం కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ శాసన సభ అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరావు, ఇతర సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సామూహిక ప్రతిజ్ఞ చేశారు.

ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో జరిగిన వేడుకల్లో సంస్థ డైరెక్టర్ (కార్పొరేట్ ప్లానింగ్ అండ్ పర్సనల్) కమాండర్ రాకేష్ ప్రసాద్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు.

మద్దిలపాలెంలోని కృష్ణ కాలేజ్ రోడ్డులోగల వైసిపి కార్యాలయంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో ఎంపీ గొల్ల బాబూరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు పాల్గొన్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ కేతన్ పాల్గొన్నారు. ఇగ్నో, నగర ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం, బిజెపి జిల్లా కార్యాలయంలో వేడుకలు జరిగాయి. వాల్తేరు రైల్వే డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో డిఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఎయులో జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ పాల్గొన్నారు.

పెందుర్తి: పెందుర్తి అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ టి.సుబ్బారాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో బొండపల్లి సత్యం, బోనెల ఏసేపు, జలగడుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ములగాడ : సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ సదస్సు నిర్వహించారు. రాజ్యాంగంపై విద్యార్థులకు క్విజ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇపిఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, ప్రిన్సిపల్ సిస్టర్ ప్రేమకుమారి పాల్గొన్నారు.

మల్కాపురం శాఖ గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ ప్రవేశికను పఠించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో న్యాయ కళాశాల ఆవరణలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద డీన్ ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్.లక్ష్మణరావు, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రతిమ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్ మధుసుధనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, గీతం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాక్ లోక్‌సభను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌విజి.రెడ్డి, డాక్టర్ శివ సత్యనారాయణ పాల్గొన్నారు.

తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణ, పి.చిట్టిబాబు, అచ్యుత రావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగం డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యుల వేషధారణతో విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇమంది రమేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తగరపువలస సర్కిల్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. రాజ్యాంగ పీఠికను పఠనం చేశారు. క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీవాణి, ట్రాఫిక్ ఎస్ఐ బి.తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రి అధికారులు, సిబ్బందితో కలిసి రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదువుతూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

గాజువాక : పాత వడ్లపూడి ఎస్‌సి కాలనీలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. 87 వార్డు కార్పొరేటర్ బొండా జగన్, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుకోటి చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు వైటి.దాస్, జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న తదితరులు మాట్లాడారు. మజ్జి పుష్పమ్మ రాజ్యాంగ పీఠికను చదివి ప్రమాణం చేయించారు. కెవిపిఎస్ నాయకులు గొలగాని అప్పారావు, నక్కా నాగరాజు, సరోజిని, ఇమ్మానుయేలు, సాధురావు, ఎస్.గణేష్, గాలి నూకరాజు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ ఏర్పాటుచేసి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు యువివి.ప్రసాద్, ఉపాధ్యాయులు లలితాదేవి, శివగంగ వరలక్ష్మి పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆనందపురం మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా దుమ్మెద అప్పలసూరి మండల ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం పి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాధవధార : శాంతినికేతన్, శ్రీచైతన్య ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు రమణ, అడ్వకేట్ నాగేశ్వరరావు, పిన్నింటి రామకృష్ణ తదితరులు పాల్గొని రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు.

సీతమ్మధార : జై భీమ్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగం గురించి కెజిహెచ్ పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ బాబు, కోన ప్రకాష్, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. డైరెక్టర్ టి.వనజ భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్.హరిబాబు, డి.సుమన్ కల్యాణి, వి.విజయలలిత పాల్గొన్నారు.

అనకాపల్లి : రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా పంచాయతీ కార్యాలయంలో డిపిఒ ఇ.సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు.. స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో, కొత్తూరు జంక్షన్ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం వద్ద, డైట్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠ రావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎఎస్‌పిలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు పాల్గొన్నారు. అనకాపల్లి కోర్టులో న్యాయమూర్తి నరేష్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులందరూ రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు.

దేవరాపల్లి : స్థానిక అంబేద్కర్ యూత్ సంఘం, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలోఅంబేద్కర్ విగ్రహానికి ఎస్ఐ సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, నివాళులర్పించారు.

కశింకోట: జాతీయ రహదారి పోలీస్ స్టేషన్ వద్ద సిఐ స్వామి నాయుడు, ఎస్ఐ లక్ష్మణరావు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు శివలంక సత్యనారాయణ ఆర్థిక సహాయంతో పేదలకు లుంగీలు పంపిణీ చేశారు.

కె.కోటపాడు అయ్యన్న విద్యా సంస్థల ప్రాంగణంలో అధినేత డాక్టర్ ఖాశీం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అంబేద్కర్, న్యాయ దేవత వేషధారణలలో విద్యార్థులు అలరించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

సబ్బవరం : . స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. బి. శంకర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో అధ్యాపకులు పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : యలమంచిలి కోర్టు సముదాయంలో న్యాయవాదులు ,పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొని రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు

బుచ్చయ్యపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిడిఒ శివప్రసాద్ నారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం గ్రంథాలయంలో లైబ్రేరియన్ రమణ ఆధ్వర్యంలో అంబేద్కర్; బాబూ రాజేంద్ర ప్రసాద్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

యస్ రాయవరం.: స్థానిక మండల పరిషత్‌తో అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు ఎంపిడిఒ మీనా కుమారి డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ నివాళులర్పించారు.

గొలుగొండ:స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏపీఎం కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో బి చైతన్య అంబేద్కర్ విగ్రహానికి వాళులర్పించారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ, టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

నక్కపల్లి గురుకులంలో ప్రిన్సిపల్ ఉషారాణి, పెదబోదుగల్లం హైస్కూల్లో హెచ్‌ఎం జయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు.సర్పంచ్ ఫాతిమా మున్నిషా బేగం పాల్గొన్నారు.

నర్సీపట్నం: దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అబిడ్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు డొక్కా రాజబాబు, రెల్లిహక్కుల రాష్ట్ర అధ్యక్షులు ఎర్రం శెట్టి పాపారావు, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పెద్దాడ లోవరాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:మోడల్ ప్రైమరీ పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. పాఠశాల సిబ్బంది భానోజిరావు, బాలకృష్ణ, ఉమా పాల్గొన్నారు.
అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఐజాక్, అప్పారావు పాల్గొన్నారు.

మాడుగుల:మాడుగుల డిగ్రీకళాశాల, అంబేద్కర్ కాలనీలో రాజ్యాంగ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపాల్ జయలక్ష్మి, ఎస్సీ ఎస్టీ సెల్ అధ్యక్షులు మరివాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలో కొత్తకోట అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పూడి దేవ, స్థానికులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ జె.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన ఆర్.శ్రీనివాస్ (55) పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో బుధవారం వేకువజామున పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్ పిఎం.పాలెం ఆఖరి బస్ స్టాప్ వద్ద ఉన్న తన తల్లిని చూసేందుకు వచ్చినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కెజిహెచ్ శవాగారానికి తరలించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాశక్తి- పాయకరావుపేట : మండలంలోని శ్రీరాంపురం గ్రామ శివారులో పోలీసులు దాడి చేసి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తినిఅరెస్టు చెసారు. పోలీసులకు అందిన సమాచారం దాడులు చేయగా, పోలీసులను చూసి పారిపోతున్న వ్యక్తిని ఏఎస్ఐ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఎటువంటి రసీదులు లేకుండా బెంగళూరు విస్కీ నాలుగు సీసాలు, ట్రాపికోనా బ్రాందీ 4 సీసాలు, మొత్తం 8 సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదనపు పిపిగా పార్థసారథి

ప్రజాశక్తి- లీగల్ : విశాఖపట్నం ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కం ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది కర్రి పార్థసారథిని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లా డిపార్ట్మెంట్ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ పదవిలో మూడేళ్లు విధులు నిర్వర్తించనున్నారు. ఈ పదవిలో నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు. ఈయన నియామకం పట్ల విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లాలం పార్వతీనాయుడు, తెలుగుదేశం న్యాయవిభాగం రాష్ట్ర కార్య వర్గ నాయకులు మానం శోభన్ బాబు, నవ్యాంధ్ర న్యాయవాదుల సంఘం అధ్యక్షులు హరిహర రెడ్డి, ఉపాధ్యక్షులు పి.ఈశ్వరరావు, నాయుడు అభినందనలు తెలియజేశారు.

శొంఠ్యాం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-సీతమ్మధార : శొంఠ్యాం ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. అభ ఐడి రిజిస్ట్రేషన్, ఎఎన్ఎం సేవలపై సమీక్ష చేశారు. ఫార్మసీని పరిశీలించి మందులను తనిఖీచేశారు. గర్భిణుల సేవలు, ఎన్‌సిడి స్క్రీనింగ్, సాధ్యమైనంత వరకు అందరికీ అందుబాటులో ఉండాలని, ఈహెచ్‌ఆర్, ఐహెచ్‌ఐపి, ఆర్‌సిహెచ్ నమోదు చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది అందరూ ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధిగా వేయాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. తదుపరి కొత్తగా నిర్మించబోయే ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఉమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు ప్రభుత్వ న్యాయవాది బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- లీగల్ : విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయస్థానం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా కన్నూరు అప్పలనాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం తరపున సమర్థవంతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంకె శ్రీనివాస్, ఎల్‌పి నాయుడు, పిఎస్.నాయుడు, బుగత సత్యనారాయణ, కర్రి పార్థసారథి, నరవ చంద్రశేఖర్, రేవతి, బి.రాజశేఖర్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

జనాభా గణన సర్వే

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలో జనాభా గణన సర్వే కొనసాగుతోంది. సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి 34 అంశాలను కుటుంబాలకు వివరించి, సేకరించి సర్వే చేస్తున్నారు. మూడో వార్డులో సర్వే ప్రక్రియను జనాభా గణన పరిశీలకులు త్రినాథరావు బుధవారం పరిశీలించారు. సూపర్‌వైజర్ బి.గోవింద్, ఎన్యూమరేటర్ బి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘ సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఉన్న మహిళా సంఘాల అధ్యక్షులు, విఒఎలకు సంవత్సర యాక్షన్‌ప్లాన్‌పై మూడు రోజుల శిక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్టు మేనేజర్ బి.వైదేహి మాట్లాడుతూ, సెక్టన్‌లో ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, పరివర్తనలో మార్పు, జీవనోపాధి తదితరాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంఘానికి అవసరమైన అంశాలను సభ్యుల నుండే తీసుకున్న తర్వాత మండల స్థాయిలో ఏడాదికి సరిపడే యాక్షన్ ప్లాన్ తయారుచేసి జాతీయ గ్రామీణ జీవనోపాధి (ఎన్ఆర్ఎల్ఎం) సంస్థకు ప్రతిపాదన పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం వెంకటరమణ, సిసిలు రమణ, శ్రీరాం, శ్రీనివాస, ఎలొసిసిసి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థినుల వనభోజనాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి గొల్లలపాలెంలోని కెజిబివి విద్యార్థినులు, ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం మామిడి తోటలో వనభోజనాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు హాజరై మాట్లాడుతూ, ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థినుల్లో మానసిక ఆనందాన్ని ఇస్తాయన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ చందవరపు కుమార్ మాట్లాడుతూ, చదువుతో పాటు ఆట పాట కూడా అవసరమన్నారు. మెజీషియన్ రవి, రాజబాబు ఆధ్వర్యంలో మ్యాజిక్ షో నిర్వహించారు. ప్రిన్సిపల్ గంగా కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి 14 నుంచి 17 ఏళ్లలోపు బాల బాలికలకు నిర్వహించిన రగ్బీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఎస్.సాత్విక్‌రామ్, బి.హర్షిత, జూడో పోటీల్లో 7వ తరగతి విద్యార్థినులు సిహెచ్.గుణసాత్విక్, టి.ప్రియ, మనస్విని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు సన్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. వీరిని పాఠశాలలో బుధ వారం ఆయన అభినందించారు.

వసతి గృహాలకు హెచ్‌పిటిఎస్ యాప్

ప్రజాశక్తి- మధురవాడ : వసతిగృహాల్లో తప్పిదాలకు, అవకతవకలకు ఆస్కారం లేకుండా కూటమి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేయించిన కూటమి ప్రభుత్వం కృత్రిమమేధ సాంకేతికతతో 'హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం' (హెచ్‌పిటిఎస్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థులు ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకూ జరిగిన అంశాలన్నీ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రోజు వారీ కార్యకలాపాలతో పాటు వారాంతం, నెల వారీ అంశాలను సైతం అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏవైనా అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ జరిగితే వసతిగృహం ఉద్యోగులపై చర్యలు తీసుకుంటారు. వసతిగృహం ప్రాంగణంలో వంటగది పాత్రలు శుభ్రపర్చడం, విద్యార్థుల నివాసపు గదులు, వరండా, ప్రాంగణంలో శుభ్రత చర్యలు, ఆహారం వడ్డించడం, సిబ్బంది పరిశుభ్రంగా ఉండటం, వ్యర్థాలను తొలగించడం, భోజనశాల శుభ్రపర్చడం, విద్యార్థుల హాజరు, ఆరోగ్య పరిస్థితి, తాగునీరు తదితరాలకు సంబంధించిన చిత్రాలను ప్రతి రోజూ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రతి ఆదివారం కచ్చితంగా నిల్వ చేసిన నిత్యావసర సరకులు, వసతిగృహం పరిసరాలు, కాలువల శుభ్రత, నీళ్లట్యాంకు, మరుగుదొడ్లు, స్నానపు గదుల శుభ్రత తదితరాలు చేయాలి.

శస్త్రచికిత్సలపై మొబైల్ శిక్షణ

ప్రజాశక్తి-మధురవాడ : యువ వైద్యులకు శస్త్రచికిత్సలపై శిక్షణ ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జాన్సన్ అండ్ జాన్సన్ సహకారంతో 'వీల్స్ ఆన్ స్కిల్స్' అనే మొబైల్ శిక్షణా కార్యక్రమాన్ని జిమ్సర్ ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రత్యేక బస్సులో ఏర్పాటుచేసిన ఆపరేషన్ థియేటర్‌లో యువ వైద్యులకు, వైద్య విద్యార్థులకు ల్యాప్రోస్కోపిక్ సర్జరీపై శిక్షణ అందిస్తున్నారు. కార్యక్రమం ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఉన్న వైద్యులు కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం ఉందని, ఇది వైద్య విద్యార్థులకు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి, రోగులకు మెరుగైన చికిత్స అందించడానికి సహాయపడుతుందని గీతాంజలి చెప్పారు. కార్యక్రమంలో జిమ్సర్ కళాశాల డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, సీనియర్ డాక్టర్లు, వివిధ విభాగాధిపతులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలేవీ?

ప్రజాశక్తి -పద్మనాభం : ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నూర్పులుచేసి ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెట్టి సిద్ధంగా ఉంచుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకాకపోవడంతో వాటిని అమ్ముకోవడం ఎలా అని రైతులందరూ ఎదురుచూస్తున్నారు. తుపాను ఉన్నట్లు వాతావరణ కేంద్రాలు జోరుగా ప్రసారాలు చేస్తుండటంతో చేతికి వచ్చిన పంట తడిసి పాడైపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. తయారైన ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి ఇంట్లో స్థలం లేక కళ్లల్లో ఉంచలేక, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకాకపోవడంతో అమ్ముకోలేక తర్జనబర్జన పడుతున్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం సిద్ధం

వరి కోత కోసి నూర్పిడి చేసి ధాన్యాన్ని సిద్ధం చేశాం. వాటిని అమ్మేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తుందని వారం రోజులుగా ఎదురుచూస్తున్నాం.



కళ్ల సూరి


నూర్పు చేసి పది రోజులైంది

వరి కోత యంత్రంతో కోత, నూర్పు ఒకేసారి చేశాం. ధాన్యం కళ్లంలో వేసుకొని పది రోజుల నుంచి కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూస్తున్నాం. పది రోజుల నుంచి ధాన్యం కళ్లల్లో ఆరబెట్టడానికి రెండు పూటలా కూలికి మనుషులను పెడుతున్నాం. ఖర్చు పెరుగుతోంది. కొనుగోలు కేంద్రాలు లేక ధాన్యాన్ని అమ్ముకోలేకపోతున్నాం. తక్షణమే కేంద్రాలను ఏర్పాటుచేయాలి.

ముత్యాలమ్మ



టిడిపిలో పలువురు చేరిక



కాకి గంగరాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు పరిధి గాంధీనగర్‌కు చెందిన సాయిరాం కేటరింగ్ అధినేత కాకి గంగరాజు సుమారు 200 మందితో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. గాంధీనగర్‌లో బుధవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో 9, 10, 11, 12, 13 వార్డుల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో కాకి గంగరాజుకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి గంగరాజు పార్టీలో చేరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే గంగరాజు కెఎస్‌డి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కాకి గంగరాజు మాట్లాడుతూ, వార్డులో ఏ సమస్య వచ్చినా వెంటనే స్థానిక నాయకులతో సమన్వయం చేసుకొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు టిడిపి అధ్యక్షులు, కార్యదర్శులు ముగడ రాజారావు, ఒమ్మి అప్పలరాజు, గాడు అప్పలనాయుడు, ఏడువాక సన్యాసిరావు, తురకపూడి బాలస్వామి, బుడుమూరు గోవిందు, టిడిపి సీనియర్ నాయకులు గాడి సత్యం, పొత్రకొండ ధర్మారావు, మద్దిల రాజేష్, కెల్ల సత్యనారాయణ, మూది అప్పారావు, రేఖా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీకి వైకల్య నిర్ధారణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి కొండపేట భవిత కేంద్రం ప్రాంగణంలో పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష సంయుక్తాధ్వర్యాన బుధవారం భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ నిమిత్తం గుర్తింపు, వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. మూడు మండలాలకు చెందిన 70 మందికి ఆర్టిఫిషియల్ లింగ్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ సంస్థ వైద్యులు విక్రమ్ మెహరన్ నిర్ధారణ, వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్యా సమన్వయకర్త యు.నీరజ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు అనంతరం అర్హులైన వారికి వీల్ చైర్లు, సిపి చైర్లు, హియరింగ్ ఎయిడ్స్, ఎంఆర్ కిట్లు అందజేస్తామని చెప్పారు. పత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను, పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 జయప్రద, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ఐఇఆర్‌పిలు కె.జియాకుమారి, పార్వతి, శ్రీనివాసరావు, నాగమణి, శ్రీనివాసరావు, స్పెషల్ ఎడ్యుకేటర్లు రామస్వామి, బి.ముత్యాలనాయుడు, ఆర్.హైమ, స్థానిక జివిఎంసి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటరమణ, ఉపాధ్యాయులు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం కాంగ్రెస్ అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని కోరాడ గ్రామానికి చెందిన పద్మనాభం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎంవివి.సత్యనారాయణను భీమిలి బ్యాంకు కాలనీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ భీమిలి ఇన్‌ఛార్జి రామకృష్ణ మాట్లాడుతూ, ఓట్ చోర్ గద్దీ చోడ్ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో సంతకాలు సేకరించిన నేపథ్యంలో సత్యనారాయణను సత్కరించినట్లు తెలిపారు. ఎపిసిసి జనరల్ సెక్రటరీ గాదం మహేష్ మాట్లాడుతూ, అందరి సమిష్టి కృషి అభినందనీయమని, భీమిలిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, ఆ దిశగా మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రెడ్డి మధుసూదన్, గౌతమ, పొట్టి రజనీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.



పద్మనాభం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణను సత్కరిస్తున్న నాయకులు

పెంటలో స్వామిత్వ గ్రామసభ

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని పెంట గ్రామ పంచాయతీలో బుధవారం ఇల్లు కొలతల్లో, యజమాని పేరులో సవరణలు ఉంటే అభ్యంతరాల స్వీకరణకు 'స్వామిత్వ' గ్రామసభ నిర్వహించారు. ఎంపిడిఒ కె.రూపేష్, డిప్యూటీ ఎంపిడిఒ రమణ, సర్పంచ్ బి.పావని అధ్యక్షతన సభ నిర్వహించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌ను, ఇన్ లైన్ క్లోరినేషన్ యూనిట్‌ను వారు సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కెవి.విద్యాసాగర్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ మేనేజర్ ఐ.బాలరాజు, డిప్యూటీ మేనేజర్ పి.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిఎఫ్ వెరిఫికేషన్

ప్రజాశక్తి -తగరపువలస: చిట్టివలస జూట్ మిల్లు కార్మికుల పిఎఫ్ రికార్డులను విశాఖపట్నం పిఎఫ్ కమిషనర్ అవినాష్ కుమార్ చిట్టివలసలో పరిశీలించారు. కార్మికులకు రావలసిన బకాయిలపై జ్యూట్‌మిల్లు యాజమాన్యంతో చర్చించారు. జూట్ మిల్లు పెన్షనర్ల సంఘం నాయకులు దామోదర బాబాజీ, మోర అప్పలరాజు కమిషనర్‌ను కలిసి పెన్షనర్ల సమస్యలపై వినతిపత్రం అందించారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారు. పెన్షన్‌కు వచ్చేటప్పుడు ఆధార్, రేషన్‌కార్డు, పాన్ కార్డును బ్యాంకు అకౌంటుకు లింక్ చేయాలని, ఫోన్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిడి అప్పారావు, చిల్ల అప్పారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నిత్యాన్నదానం

ప్రజాశక్తి -తగరపువలస : భీమునిపట్నం మండలం సింగనబంధ పంచాయతీ కృష్ణరాజుపేట రామాలయంలో అయ్యప్ప స్వామి సేవ పీఠం ఆధ్వర్యాన 41 రోజుల పాటు అయ్యప్ప, భవానీ, శివ స్వాములకు ఏర్పాటుచేసిన నిత్యాన్నదానం బుధవారంతో ముగిసింది. ముగింపు రోజున స్వాములతో పాటు డొకరపేట, లక్ష్మీపురం, మజ్జివలస గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, తుపాకుల పైడిరాజు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గురువారం 27 నవంబర్ 2025

లేబర్ కోడ్స్‌పై నిరసనల వెల్లువ



ములగాడలో మాట్లాడుతున్న ఎం.జగ్గునాయుడు

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో భారీ కార్మిక ప్రదర్శనలు, మానవహారాలు
- కార్మికుల పొట్టగొడితే ఊరుకునేది లేదని హెచ్చరిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా సమ్మె చేస్తామని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న లలిత జ్యూయలర్స్ నుంచి ఆశీలు మెట్ట మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జివిఎంసి మెయిన్ రోడ్డులో మానవహారం చేపట్టారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఎపిఎఫ్‌టియు నాయకురాలు మహిత, ఎఐసిసిటియు నాయకులు వాసుదేవరావు తదితరులు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్మిక ప్రయోజనాలను తాకట్టు పెట్టి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పనిచేస్తోందన్నారు. బ్రిటిష్ కాలంలోనే పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను మార్పు చేసి 4 లేబర్ కోడ్స్‌గా తీసుకువచ్చిందన్నారు. అవి అమలు జరిగితే కార్మికులు బానిసలుగా మారతారన్నారు. ఈ నేపథ్యంలో వాటి రద్దుకు కార్మికవర్గం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పద్మ, మేరీ, సుధాకర్, ప్రవంత్, సత్యవతి, మంగశ్రీ, కె.సుధాకర్, బి.జగన్, పి.మణి, పి.వెంకటరావు, కెఎం.కుమార మంగళం, చంద్రమౌళి, వై.రాజు, మన్మధరావు, అచ్యుతరావు పాల్గొన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు హెచ్చరించాయి. పోర్టు చైర్మన్ ఆఫీస్ వద్ద బుధవారం ఆయా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు విఎస్. పద్మనాభ రాజు, కె.సత్యనారాయణ, సిహెచ్. త్రినాధరావు, బి.లక్ష్మణరావు, ఎఐటియుసి నాయకులు బిసిహెచ్ .మసేన్, హెచ్ఎంఎస్ నేత మంగ నాయుడు, ఐఎన్‌టియుసి నాయకులు చందు పాల్గొన్నారు.

ములగాడ : అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన హెచ్‌పిసిఎల్ లేబర్ గేటు వద్ద నిరసన తెలిపారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్షణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు ఎం.జగ్గునాయుడు, భోగవల్లి నాగభూష ణం, కె.సత్యనారాయణ, పివి.సురేష్, పట్నాయక్ మాట్లాడుతూ, కార్మికులకు నష్టం కలిగించే 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కార్మిక సంఘాల నాయకులు జి.నరేష్, ఎస్.తాతబాబు, జి.రాంబాబు, అనిల్, కె.పెంటారావు, పి.పైడిరాజు పాల్గొన్నారు.

గాజువాక : భెల్ మెయిన్ గేటు వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష యూనియన్ నాయకులు సీతన్ననాయుడు, జిటిపి.ప్రకాష్, ఎస్.సాహు, వి.ఆనందరావు, పివిఎన్.రాజు, మురళీశ్వరరావు, కె.నారపరెడ్డి పాల్గొన్నారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, కార్మిక సంఘాల పిలుపు మేరకు గాజువాకలోని షిప్‌యార్డ్, గాజువాక బేస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్.నాగరాజు, ఈ.శ్రీనివాస్, సిహెచ్.రత్నకుమార్, రవిశంకర్ పాల్గొన్నారు.

ఉక్కునగరం : ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు ఆధ్వర్యాన ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, వై.రామస్వామి, రమణమూర్తి, కెఎస్ఎన్, అప్పారావు, రమణారెడ్డి పాల్గొన్నారు.



పరవాడలో కార్మికుల రాస్తారోకో



స్టీల్‌ప్లాంట్‌లో అఖిలపక్ష కార్మిక సంఘాల నిరసన

అనకాపల్లి : కేంద్ర బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ నోటిఫై చేయడాన్ని, రైతాంగ వ్యతిరేక విధానాలు నిరసిస్తూ బుధవారం కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య, సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాల ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి నెహ్రూ చౌక్ మీదగా ఆర్‌డిఒ కారాయలయం వరకు నిరసన ర్యాలీ చేశారు. ఆర్‌డిఒకు వినతిపత్రం అందించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన సభలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ఉద్యోగులు, కార్మికులను యజమానులు కట్టు బానిసలుగా చేసే విధంగా లేబర్ కోడ్స్ ఉన్నాయన్నారు. ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో 12 గంటల పని విధానం అమలు, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు హరించే విధంగా ఈ లేబర్ కోడ్స్ తెచ్చారని నాయకులన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ అడుగుజాడల్లో రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కూడా ఈ లేబర్ కోడ్స్ అమలుకై రాష్ట్రంలో రూల్స్ రూపొందించి 8 గంటల పనిని 12 గంటలకు పెంచటం, మహిళలను రాత్రి డ్యూటీలు చేయాలని నిర్ణయం తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, గండి నాయన బాబు, గొర్రెల,మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్, నాయకులు వియ్యపు రాజు, రెడ్డిపల్లి అప్పలరాజు, శంకరరావు,కోన మోహన్, నాగిరెడ్డి సత్యనారాయణ, తాతారావు, పరమేశ్వర రావు, కన్నబాబు, అజయ్ పాల్గొన్నారు.

పరవాడ : నాలుగు లేబర్ కోడ్ వెంటనే ఉపసంహరించుకోవాలని పరవాడ సినిమా హాల్ జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్వవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులుకె.నాయుడు, అప్పారావు, శ్రీను, సత్తిబాబు, లచ్చిబాబు, పాల్గొన్నారు.

అచ్చుతాపురం : లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ అచ్చుతాపురం జంక్షన్‌లో సిఐటియు, వైఎస్ఆర్‌టియుసి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాజన్న సత్తిబాబు, కర్రినాయుడు, తట్టా రాజు, నాయకులు మున్నూరు సన్యాసి నాయుడు, రామకష్ణ, వైయస్సార్ ట్రేడింగ్ నాయకులు మెరుగు రాజేష్, కే నాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

కశింకోట: లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సంతబయలు నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. సిఐటియు ప్రజా సంఘాల నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, టి.తనుజ, సూర్యలక్ష్మి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి చిన్నారి, పూర్ణమ్మ, జయలక్ష్మి, విజయలక్ష్మి, నాగమణి, పద్మ, అచ్చియమ్మ, నూకరత్నం, లీలావతి, అమ్మాజీ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో బ్యాంకు ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న యుబిఐ ఉద్యోగులు, సిబ్బంది

అనకాపల్లి : ఏకపక్షంగా లేబర్ కోడ్స్ అమలును నిరసిస్తూ బుధవారం ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపుమేరకు బుధవారం మెయిన్ రోడ్‌లోని యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. యూనియన్ బ్యాంక్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ కాండ్రేగుల హరికృష్ణ, బ్యాంకు ఉద్యోగులు భవాని, సౌమ్య,మాలతి, ఎవిజి.రాజు పాల్గొన్నారు. అలాగే ఉడ్‌పేట శాఖ వద్ద నిరసనలో ఆడారి చంద్రశేఖర్, వానపల్లి లక్ష్మణరావు, టి శ్రీనివాసరావు ,ప్రసన్న, గవరపాలెం బ్రాంచ్ వద్ద సిబ్బంది రాజు, అప్పారావు, ఎన్ గోపి,సూర్య కుమారి ,రోజాశ్రీ, ఆడారి రాజా, గ్రంధి శ్రావణి , తుమ్మపాల ఇండియన్ బ్యాంకు శాఖ వద్ద శరగడం శ్రీనివాసు, ధన్వంతరి,నిశాంత్, గిరిధర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఆందోళన



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్టు చట్టాలను పునరుద్దరించాలంటూ బుధవారం అనకాపల్లిలో జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపుమేరకు లేబర్ కోడ్స్‌కు రద్దుగా చేపట్టిన ఆందోళనలకు సంఘీభావంగా ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జర్నలిస్ట్‌లు నిరసన తెలిపారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షులు బి. వెంకటేష్, జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి కె. గణేష్, సభ్యులు వై. నాగు, సురేష్ , కోన లక్ష్మణ్, సంజీవ్, బి. అప్పారావు, గోపాల్, దేముడు బాబు పాల్గొన్నారు.

యలమంచిలి ఎంపిపి తొలగింపు

ఉపాధ్యక్షుడు రాజానకు బాధ్యతలు అప్పగింత



రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : విశ్వాస పరీక్షలో ఓటమి పాలైన యలమంచిలి ఎంపిపి బోదేపు గోవిందరావును ఆ పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిఒఎంఎస్ సంఖ్య 95/తే 25నవంబర్ 2025 ఉత్వర్వులు జారీ చేశారు. ఎంపిపి గోవిందరావుపై మెజార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన నేపథ్యంలో గతనెల 18న మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అవిశ్వాసం నెగ్గినందున ఎంపిపిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదే సమయంలో ఖాళీ ఏర్పడిన ఎంపిపి స్థానంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994 పరిచ్ఛేదానం 165నందలి ఉపచ్ఛేదనం 4 అనుసరించి ప్రస్తుత మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజాన సూర్యచంద్ర శేషగిరిరావుకు అధ్యక్ష బాధ్యతలను అప్పగిస్తూ బుధవారం అధికారులు నోటు ఉత్తర్వులు జారీ చేశారని ఎంపిడిఒ కొండలరావు తెలిపారు. కొత్తగా ఎంపిపిని ఎన్నుకునే వరకు అధ్యక్షుల అధికారాలను ప్రస్తుత ఉపాధ్యక్షులు వినియోగించుకునేలా ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాల సీజ్

క్వారీ యజమానులకు డిఎస్‌పి శ్రావణి హెచ్చరిక



మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రావణి

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్: క్వారీ యజమానులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని డిఎస్‌పి శ్రావణి హెచ్చరించారు. ఇటీవల విజయరామరాజుపేట రైల్వే అండం బ్రిడ్జిని క్వారీ వాహనం ఢీకొట్టడంతో గడ్డర్లు ధ్వంసమైన నేపథ్యంలో బుధవారం.క్వారీ, లారీ యజమానులతో సమావేశమయ్యారు. ఓవర్ లోడ్‌తో అనకాపల్లి టౌన్‌లోకి క్వారీ వాహనాలు వస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో. ట్రాఫిక్ సి. ఐ వెంకటనారాయణ, టౌన్ సిఐ ప్రేమ్ కుమార్, రూరల్ సిఐ అశోక్ కుమార్, ఎంవిఐ రాజన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఓల్డ్ హెరిటేజ్ వీక్‌లో భాగంగా బొజ్జన్న కొండ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ బుధవారం అట్టహాసంగా ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఏయూ హిస్టరీ ప్రొఫెసర్, హెచ్ఒడి డాక్టర్ మధుసూదన్ రావు, అనకాపల్లి రూరల్ సిఐ అశోక్ కుమార్ పాల్గొని వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెరిటేజ్ సైట్ల ప్రాముఖ్యతను, బొజ్జన్న కొండ విశిష్టతను కాపాడాలని, భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. పురావస్తు శాఖ సిబ్బంది దేవేంద్రనాథ్ బోయి, కమల్ హాసన్, సుందరం, మూర్తి, మహోదయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వార్షిక ప్రణాళికపై కొనసాగిన శిక్షణ

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వార్షిక ప్రణాళికపై గ్రామ సంఘ అధ్యక్షులకు బుధవారం రెండో రోజు శిక్షణ కొనసాగింది. శిక్షణ కార్యక్రమాన్ని డిఆర్‌డిఎ పీడీ కె.శచిదేవి పర్యవేక్షించారు. సమూహాలు ఆర్థిక క్రమశిక్షణను పాటించడం అత్యవసరమన్నారు. పొదుపు, రుణ చెల్లింపులు, బుక్ కీపింగ్ అంశాల్లో గ్రామ సంఘాలు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. స్థిరమైన జీవనోపాధులు ద్వారా మహిళలు కుటుంబ ఆదాయాన్ని నెలకు కనీసం రూ.పదివేలకు పైగా పెంచుకోవాలని పిడీ సూచించారు. మార్కెట్ లింకేజీ, నైపుణ్యాభివృద్ధి, చిన్న వ్యాపారాల విస్తరణపై మరింత దృష్టి పెట్టాలన్నారు. వెలుగు ఎపిఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

జాతీయ క్రీడా పోటీలకు ఎంపిక

టెన్ని కాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి -సబ్బవరం.: స్థానికఅంబేద్కర్ గురుకులం విద్యార్థులు జె. సంపత్ వినయ్‌కుమార్, ఒ.రవికిషోర్ జాతీయస్థాయి టెన్ని కాయిట్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ కేశవరావు తెలిపారు శ్రీకాకుళం జిల్లా . పలాసలో జరిగిన అంతర జిల్లాల సబ్ జూనియర్ టెన్నీకాయిట్ అద్భుత ప్రతిభను కనబరిచి విజయాన్ని సాధించారు. వచ్చేనెల 21నుంచి 24 వరకు కేరళలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి. కనకారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎన్.వి. సత్యనారాయణ, పిఇటి వి. సూర్యనారాయణ, పీడీ సిఎల్ఎన్. ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్స్ కె. చిరంజీవి, వెంకట్రావు, రాంబాబు, జానకిరాం, రఘురామనాయుడు అభినందించారు.

వివిధ ఈవెంట్స్‌లో సంస్కృతి గ్లోబల్ విద్యార్థులు

ప్రజాశక్తి -పరవాడ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆర్చరీ, బాక్సింగ్, షూటింగ్, స్విమ్మింగ్, సాఫ్ట్‌బాల్, వుషు క్రీడలలో సంస్కృతి గ్లోబల్ విద్యార్థులు సత్తాచాటారు. కె.సాయి మనస్వి, సిహెచ్ ప్రణీత్, ఎన్.మోహిత, వి.ఆద్య జి.జానేష్(ఆర్చరీ). క్రితి పర్వార్, శ్రేష్ఠి పర్వార్, మధురిమ (బాక్సింగ్). జె.జయదీప్, ఎమ్. కార్తీక్, జి. రోషిణి(స్విమ్మింగ్). ఎస్.సురేంద్ర, సాయిరవి, త్రిష వర్మ జహీర్ అలీ (షూటింగ్,. పి.అభినవ్(వుషు), ప్రతీక్ కుమార్ (సాఫ్ట్ బాల్).పోటల్లో సత్తాచాటి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి తెలిపారు. క్రీడాకారులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు గోవింద్, శివకుమార్, హరినాథ్ రెడ్డి, రాజేష్ కుమార్, రామ్మోహన్, లోహిత్, రమ్య, అమర్నాథ్, అన్నపూర్ణలను పాఠశాల సిఇఒ కె. నిశాంత్ అభినందించారు.

ఖోఖో పోటీలకు నవ్య ఎంపిక

ప్రజాశక్తి.-అనకాపల్లి : వచ్చేనెలలో అయోధ్యలో జరిగే జాతీయస్థాయి అండర్ 17 ఖోఖో పోటీలకు తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గొర్లి నవ్య ఎంపికయ్యారు. బుధవారం పాఠశాలలో నవ్యను ప్రధానోపాధ్యాయులు ఎస్ .శంకరరావు,స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పీలా వీరు నాయుడు, స్కూల్ చైర్మన్ పెతకం శెట్టి బలరాం అభినందించారు.

నానో యూరియా వాడకంపై అవగాహన

ప్రజాశక్తి- కె కోటపాడు : నానో యూరియా వాడకం వల్ల తక్కువ పెట్టుబడితో రైతులు నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి సోమ శేఖర్ అన్నారు.. బుధవారం మేడిచెర్లలో ఆత్మ సంస్థ ఆధ్వర్యంలో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ల ద్వారా పురుగుమందులతో కలిపి నానో యూరియాపిచికారీ చేసుకోవచ్చున్నారు.రైతులు గ్రూపులుగా ఏర్పడితే 80సబ్సిడీపై డ్రోన్లు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ గౌరీ శంకర్, విఎఎ జనార్ధన్, ఆత్మ ఎటిఎం హేమ ప్రకృతి వ్యవసాయ అధికారులు రాముడు, తులసి భాస్కర్, పూడి నారాయణమూర్తి పూడి శ్రీనివాస్ పూడి ప్రకాశరావు పాల్గొన్నారు

అనకాపల్లి డివిజన్‌లో కొనసాగించాలి

ప్రజాశక్తి-మునగపాక: ఎలమంచిలి నియోజకవర్గాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో కొనసాగించాలని వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ నక్కపల్లిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడానికి స్వాగతించారు. అదే సమయంలో ఎలమంచిలి నియోజకవర్గాన్ని సుదూరాన ఉన్న నక్కపల్లి డివిజనలో కలిపితే మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల ప్రజలు ఇబ్బందులు పడతారని, దగ్గర్లోనే ఉన్న అనకాపల్లిలో కొనసాగించాలన్నారు.

వారసులకు డిపట్టా బదలాయించాలి

ప్రజాశక్తి- దేవరాపల్లి : తల్లిదండ్రుల నుంచి వంశపారం పర్యంగా డి పట్టా భూములను వారి వారసులకు పట్టా మంజూరు చేయా లని దళిత సంఘాల నాయకులు కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. తహశీల్దార్ పి.లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేశారు ఈ సందర్బం గా సంఘ నాయకుడు ఎ.చంటి మాట్లాడుతూ, మండలంలోని ముషిడిపల్లి రెవిన్యూ పరిధిలో సర్వే నెంబరు. 583/4 లో 72 సెంట్లు సీలింగ్ భూమిని కొత్తూరు ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన కణితి దండేసుకు డిపట్టా ఉందని, అతను మృతి చెందిన నేపథ్యంలో అతని కుమారుడు అర్జునరావుకు పట్టా మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. తహశీల్దార్ స్పందిస్తూ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు అర్జునరావు, వరలక్ష్మి, సర్పంచ్ గంధం రామకృష్ణ, చౌడువాడ అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నూతన కమిటీ

● అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసరావు, చంద్ర శేఖర్ ఎన్నిక



విద్యుత్ ఉద్యోగుల రీజనల్ నూతన కమిటీ

ప్రజాశక్తి -అనకాపల్లి: ఏపిఈపిడిసిఎల్ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం బుధవారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ఎపిఇపి డిసిఎల్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ సాయిబాబు, ఎం నిర్మమూర్తి పరిశీలకులుగా నూతన రీజినల్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా డి బాపిరాజు, అధ్యక్షులుగా ఒ.శ్రీనివాసరావు, కార్యదర్శిగా పి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వై రాజయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గా బి వరహాలు, ట్రెజరీ గా పి ఎస్ ఎన్ మూర్తి , వైస్ ప్రెసిడెంట్ లుగా సిహెచ్ లోవరాజు, జె అశోక్ రాజీవ్, సిహెచ్ మధు, ఎం.రాజుపెంటయ్య, ఎస్ ఈశ్వరరావు, అసిస్టెంట్ సెక్రటరీ లుగా కె దేముడు, ఎల్ రామకృష్ణ, పి చంద్రరావు, జిఎస్ ప్రకాష్, డి రామకృష్ణ , ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్‌గా మరో పది మందిని ఎన్నుకున్నారు. ఎనూతన కమిటీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేస్తుందని ప్రకటించారు.

30 మందికి హెటిరో ఫార్మా ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో శ్రీప్రకాష్ యాజమాన్యం

ప్రజాశక్తి - పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో హైదరాబాద్ హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాల వివిధ కళాశాలల నుండి ఫైనలియర్ బిఎస్‌సి, ఎంఎస్‌సి, కెమిస్ట్రీ, బి ఫార్మసీ, ఎం. ఫార్మసీ విద్యార్థులు సుమారు 100 మంది హాజరయ్యారు. సంస్థ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ జి.రాజు ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో రాత పరీక్షలు, హెచ్ఆర్. రౌండ్ లను నిర్వహించి, 30 మందిని హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీలో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎష్యూరెన్స్, ప్రొడక్షన్ విభాగాలలో ఉద్యోగాలకు ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఆర్ సిహెచ్ మణికంఠ, వైస్ ప్రిన్సిపల్ పెనుగొండ సుబ్బారావు, ఐక్యూసి కోఆర్డినేటర్ డాక్టర్అరుణ కుమార్ త్రిపాఠీ పాల్గొన్నారు.

ఎంఇఒల హెచ్చరికలతో రుచికరంగా మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి- కె. కోటపాడు : మండల విద్యాశాఖ అధికారుల హెచ్చరికలతో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచికరంగా మారింది. అంతకుముందు గట్టి అన్నం, నీరు సాంబారుతో విద్యార్థులు భోజనం తినే పరిస్థితి లేనప్పటికీ, పాఠశాల హెచ్ఎం పద్మావతి పట్టించుకోక పోవడంతో విదాయర్థులు పారేసే పరిస్థితి ఉండేది. దీనిపై అందించి సమాచారం మేరకు ఎంఇఒలు కె. సత్యనారాయణ డివిడి ప్రసాద్ ఈనెల 11న ఆకస్మిక తనిఖీ చేసి భోజన నిర్వహణపై అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తంచేశారు. తీరుమారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించడంతో వంట తీరుమారింది బుధవారం మరోమారు ఎంఇఒలు పాఠశాల సందర్శనకు వచ్చి భోజన రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పలుచోట్ల 'రైతన్నా.. మీ కోసం'

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ అధికారి జ్యోత్స్న పాల్గొని శాస్త్రీయ పద్దతుల్లో సాగు ద్వారా ఉత్పాదకత పెరగడం, ఖర్చులు తగ్గడం, మట్టి ఆరోగ్యం మెరుగుపడటం వంటి ప్రయోజనాలను వివరించారు.. రైతుల సమస్యలు, సందేహాలను తెలుసుకుని, పరిష్కార మార్గాలను సూచించారు. కార్యక్రమంలో భీమర శెట్టి శ్రీనివాసరావు, ఆడారి మంజు, బివి రమణ, ఎస్ రాము, భాస్కర్, రామ జోగి నాయుడు, నర్సింగరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ లక్ష్మీ సరిత పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : పట్టణంలోని యర్రవరంలో రైతు సేవా కేంద్రం సెక్రటరీ స్వాతి ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం జరిగింది. ఎఐఎంఎస్ యాప్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని వాడాలని రైతులకు అధికారులు సూచించారు. ఈ మేరకు పేర్లు నమోదు చేశారు.కార్యక్రమంలో కౌన్సిలర్ సత్తిబాబు, బీజేపీ నాయకులు సియ్యద్రి శ్రీనివాసరావు, సేనాపతి రాజమహేష్, చిన్న సూరిబాబు, కోసూరి సూరిబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీ చీమలమెట్టపాలెంలో బుధవారం రైతన్నా మీ కోసం' నిర్వహించారు. గ్రామంలోని పలువురు రైతులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కలిసి మాట్లాడారు. ప్రభుత్వం తీసుకుంటున్న వ్యవసాయ సంక్షేమ చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, కూటమి నాయకులు బిఆర్‌బి.నాయుడు, శాఖారి శ్రీనివాస్, తమ్మిన అప్పలరాజు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు సహకరించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఎంపిడిఒ చంద్రశేఖర్ అన్నారు, బుధవారం ఎండపల్లి గ్రామంలో పారిశుధ్యపనులను పరిశీలించారు, సేకరించిన చెత్తను ఎక్కడికక్కడే దగ్గం చేయకుండా డంపింగ్ యార్డ్‌కు తరలించాలని అన్నారు మంచినీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు,

ఉమ్మలాడ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి: మునగపాక: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని ఉమ్మలాడ గ్రామ సర్పంచ్ సూరిశెట్టి గంగయ్యమ్మ (77) మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆమె భౌతికకాయాన్ని రాజకీయాలకు అతీతంగా పలువురు నేతలు, చుట్టుపక్కల ప్రాంతవాసులు సందర్శించి సంతాపం తెలిపారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి -అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోనల్ కమిషనర్ చక్రవర్తి బుధవారం వార్డుల్లో పర్యటించి సమస్యలను అక్కడికక్కడికే పరిష్కరించారు. లక్ష్మీనారాయణ నగర్ ప్రధాన రహదారి, అక్కడ ప్రధాన కాలువ, ఎస్బిఐ ప్రధాన కార్యాలయం దగ్గర ఉన్న కాలువను పరిశీలించారు. లక్ష్మీనారాయణ నగర్‌లో మంచినీటి పైప్ లైన్ పగిలి, నీరు వృధాగా పోతుండడంతో తక్షణం బాగుచేయాలని వాటర్‌వర్క్స్ ఎఇని ఆదేశించారు. నిలిచిన మురుగు నీటిని తొలగించి, ప్రధాన కాలువను చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాడుగుల అప్పారావు, శానిటేషన్ సెక్రెటరీస్ శివ, మూర్తిని ఆదేశించారు.

రేషన్ కార్డుదారులకు ఉచితంగా రాగులు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలోని రేషన్ కార్డుదారులకు గురువారం నుంచి డిసెంబర్ నెల కోటాలో బియ్యం బదులుగా మూడు కిలోల వరకు రాగులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి తెలిపారు . ప్రజలకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాగులు పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, లబ్ధిదారుల రేషన్ కార్డులతో సంబంధిత దుకాణాలకు వెళ్లి ఈ ప్రయోజనాన్ని పొందవచ్చని జాయింట్ కలెక్టర్ వెల్లడించారు.

కార్యకర్తలకు పార్టీ అండ

ప్రజాశక్తి -అనకాపల్లి : కార్యకర్తలకు జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. బుధవారం కసింకోట మండలం, అనకాపల్లి పట్టణం, మండలంలో ప్రమాదవశాత్తు మరణించిన 12 మంది పార్టీ క్రియాశీల కార్యకర్తల కుటుంబానికి జనసేన పార్టీ ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు చొప్పున రూ.69 లక్షలు పరిహారాన్ని విజయవాడలో జనసేన కార్యాలయంలో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అందజేయగా, వారంతా బుధవారం ఎమ్మెల్యే కొణతాలకు కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పట్టణంలో 84వ వార్డులోని లబ్ధిదారులకు సిఎం సహాయనిధి నుంచిమంజూరైన రూ. 1,05,343 సాయం చెక్కులను జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ అందజేశారు. లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి సాయం అందజేసినట్లు రాంకీ తెలిపారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు విద్యార్థి పోరుబాట

ప్రజాశక్తి -యస్ రాయవరం : ప్రభుత్వ విద్యపరిరక్షణకు విద్యార్థి పోరుబాటనిర్వహించనున్నట్లు ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి బాబ్జి అన్నారు. బుధవారం మండలంలో అడ్డురోడ్డు ఎన్టీఆర్ విగ్రహం వద్ద రాష్ట్రవ్యాప్త విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి పోరు పోస్టర్లను ఆవిష్కరించారు అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని. ఎన్నికల సమయంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీలన్నీ విస్మరించారని మండిపడ్డారు. విద్యాసమస్యల పరిష్కారానికి చేపట్టే పోరుబాటలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.. ఈనెల 28న విజయవాడలో విద్యార్థి పోరుబాట సభ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అజయ్ , సంతోష్ , భవాని, జ్యోతి పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- పరవాడ : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందామనిపెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ముత్యాలమ్మ పాలెం పంచాయతీలో మాజీ సర్పంచ్ బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో వైసిపి కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. జెడ్‌పిటిసి పి.ఎస్.రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, బొంది మసేన్, తిక్కాడ సత్యనారాయణ, మసేన్ అమ్మ, నల్లమసేన్, పార్టీ ఉపాధ్యక్షులు పైల సత్య నారాయణ (బొబ్బిలి), పైల రాధాకృష్ణ, బత్తి అప్పారావు, బొడ్డవు చిన్నారావు, సూరాడ మహేష్, బొంది మహేష్, కోవిరి నూకరాజు, వాసుపల్లి శేఖర్, తాతారావు, కోటా అప్పారావు, ఎల్లాజీ, ఒలిశెటి కొర్లయ్య, రాజు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లిలో వైసిపి కార్యాలయాన్ని బుధవారం మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జెడ్‌పిటిసి కర్రి సత్యం, మండల పార్టీ అధ్యక్షుడు బూరె బాబురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి మరోసారి ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి బొడ్డు లక్ష్మి, సర్పంచ్‌లు మతల దేముడమ్మ, చింతల సత్య వెంకటరమణ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో చెత్త తొలగింపు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట :మండలంలోచింతపాక గ్రామంలో డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్తను స్థానిక సర్పంచ్ గోలజాన శ్రీను, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. పారిశుధ్య పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఇళ్లు ఖాళీ చేయాలని నిర్వాసితులపై ఒత్తిడి తగదు

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పలువురు నివాస గృహాలు కోల్పోయారని, ప్రత్యామ్నాయం చూపకుండా నిర్వాసితులు ఇళ్లు ఖాళీ చేయాలని అధికారులు ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు అన్నారు. మండలంలో అమలాపురం పంచాయతీ పాటిమీద గ్రామంలో బుధవారం నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ లో భాగంగా పరిశ్రమ స్థాపన కోసం చేపట్టిన భూసేకరణలో మండలంలో పాటిమీద, మూలపర్ర, తుమ్మలపేట, తమ్మయ్యపేట, బుచ్చిరాజపేట, బోయపాడు గ్రామాల్లో నివాస గృహాలు కోల్పోయిన సుమారు 745 కుటుంబాలను నిర్వాసితులుగా గుర్తించి, వారందరికీ పెదబోదుగల్లం వద్ద పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి ఇళ్ళ స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. నేటి వరకు నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ఇళ్ళ స్థలాలు అప్పగించలేదని, అదేవిధంగా నిర్వాసితులందరికీ ప్యాకేజీ చెల్లించలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం కాలనీలో విద్యా, వైద్యం ఇలా 25 రకాల సౌకర్యాలు కల్పించిన తర్వాతే పునరావాస కాలనీకి తరలించాల్సి ఉందని, కానీ ఈ విధంగా సౌకర్యాలు కల్పించకుండా ఇళ్ళులు ఖాళీ చేయాలని నిర్వాసి తులపై అధికారులు ఒత్తిడి తీసుకువస్తున్నారని, దీంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇది 2013 భూసేకరణ చట్టం సెక్షన్ 32ను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. కార్పొరేట్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు ఆగమేఘాలపై భూములు అప్పగించ డానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారే, ఇక్కడ భూములు, నివాస గృహాలు కోల్పోయిన నిర్వాసితులను ఆదుకోవడంలో ముందుకు రా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పునరావాస కాలనీలో గృహాలు నిర్మించకుండా ఇల్లులు ఖాళీ చేసి ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. నిర్వాసితులు ఇల్లులు ఖాళీ చేసి అద్దె ఇంటిలోకి వెళ్ళిపోతే నెలకు 5 వేల రూపాయలు ఇంటి అద్దె చెల్లిస్తామని అధికారులు చెప్పడం చట్ట ఉల్లంగానే అవుతుందని, ఏ చట్ట ప్రకారం ఇలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. పునరావాస కాలనీలో నిర్వాసితులు గృహాలు నిర్మించే వరకు ఇల్లులు ఖాళీ చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చట్ట ప్రకారం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ చెల్లించకుండా నిర్వాసితులను ఇబ్బందులకు గురి చేయడం న్యాయం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఆర్.ఈశ్వరరావు, ఆర్.అప్పారావు, చిన్నమ్మలు, శ్రీను, వెంకటేష్, నూకరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

పర్యావరణ పరిరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పర్యావరణం పరిరక్షణ పై డ్వాక్రా సంఘాల మహిళలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, చెట్లను నాటడం, నీటి సంరక్షణ వంటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ వ్యవసాయం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం వంటి అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఏపిఎం కరుణానిధి పాల్గొన్నారు.



సారె ఊరేగిస్తున్న భక్తులు

గైరమ్మ సారె ఊరేగింపు

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగులలో గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. బుధవారం కాలనీ వాసులు సారెను ఊరేగించారు.



మాట్లాడుతున్న కొత్తకోట సీఐ కోటేశ్వరరావు

గంజాయిని నిర్మూలించాలి

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండలం ఎంకే.పట్నం పంచాయతీ పెదపేట గ్రామంలో గంజాయి నిర్మూలనపై కొత్తకోట సీఐ జీ.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గంజాయి రవాణా చేయడం, పడించడం, రవాణాకు సహకరించడం నేరమన్నారు. ఇప్పటికే చాలా మంది గంజాయి జోలికి వెళ్లి జైలు పాలయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాతకృష్టదేవిపేటలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:సిపిఐ నాయకులు కామ్రేడ్ మేకా సూరిబాబు వర్ధంతి సందర్భంగా ఆయన మనవడు, నర్సీపట్నంలోని శారద హాస్పిటల్ వైద్యులు డి.అజయ్ స్రవంత్ ఆధ్వర్యంలో గొలుగొండ మండలం పాతకృష్ణదేవిపేటలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. జనరల్, లేప్రోస్కోపీ, గ్యాస్ట్రో సర్జన్ వైద్య నిపుణులు అజయ్ స్రవంత్‌తో పాటు జనరల్ వైద్య నిపుణులు మణిదీప్, మహమ్మద్ మజీద్‌లు సుమారు 250 మందికి వైద్య సేవలు అందించారు. విశాఖపట్నంకు చెందిన సియాన్ కేన్సర్ క్లినిక్స్ వారు 43 మందికి రొమ్ము, నోటి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ పందిరి సత్యనారాయణ, ఉపసర్పంచ్ దుంపలపూడి సహదేవుడు తమ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడంపై డాక్టర్ అజయ్ స్రవంత్‌ను అభినందించారు. మేకా సూరిబాబు కుమార్తె, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరీ మాట్లాడుతూ, గతంలో తన తండ్రి సూరిబాబు గ్రామంలో వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేవారిని, హెూమియోపతి వైద్యులను పిలిపించి వైద్య సేవలు అందించేవారని తెలిపారు. ఆయన మనవడైన డాక్టర్ స్రవంత్ ఆయన ఆశయాలు కొనసాగింపులో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించడం పట్ల చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సియాన్ క్యాన్సర్ క్లినిక్ స్క్రీనింగ్ టెక్నిషియన్ వీరయ్య, నర్సింగ్ స్టాఫ్ డాఫినీ, సంజుక్త, మార్కెటింగ్ నాగరాజు, ఆర్ఎంపి వైద్యులు పందిరి వెంకటరమణ, బొబ్బాది లక్ష్మణ్, రమణ, స్కూల్ కమిటీ చైర్మన్ అనిశెట్టి గోపి స్థానిక నాయకులు ఈర్నే నాగేశ్వరరావు, రాజు, రేలంగి కిరణ్, మేకా సూరిబాబు కుటుంబ సభ్యులు డి.శారద, మేకా మాధవరావు, ఆర్ చందన, మేకా స్వరూప్, పవన్, నిహార్, శారద హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గంటాను కలిసిన రాజేశ్వరరావు

ప్రజాశక్తి-రావికమతం:ఇటీవల ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టెలికాం అడ్వైజరి కమిటీ సభ్యులుగా నియమితులైన రావికమతం మండలం గడ్డిప గ్రామానికి చెందిన గల్లా రాజేశ్వరరావు మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి ఉన్నతమైన స్థాయికి ఎదగాలని శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతను శిరసా వహించి కష్టపడి పని చేస్తానని రాజేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పైడి నాయుడు, శ్రీను, గుడివాడ మాజీ సర్పంచ్ పాల్గొన్నారు.



రాజేశ్వరరావును సత్కరిస్తున్న గంటా శ్రీనివాసరావు

డ్రగ్స్‌తో విద్యార్థుల జీవితాలు నాశనం



ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి -నర్సీపట్నం:మాదకద్రవ్యాలతో ఎన్నో అనర్థాలు కలుగుతాయని, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డి.ఎస్.పి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఆయన డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ జడ్జి సన్నిబాబు మాట్లాడుతూ, విద్యార్థులు కెరీర్ పై దృష్టి సారించి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. ఈ డ్రగ్స్‌ను తీసుకోవడంతో జీవితాలు దెబ్బతింటాయని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ గోవిందరావు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



నీటిని పడుతున్న మహిళలు

అరుంధతి కాలనీకి మంచినీరు సరఫరా

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కొత్తకోట అరుంధతి కాలనీలో మంచినీటి సమస్యపై గ్రామస్తులు చేపట్టిన నిరసనకు దిగివచ్చిన అధికారులు ప్రత్యామ్నాయంగా బుధవారం వాటర్ ట్యాంకు ద్వారా మంచినీటిని సరఫరా చేశారు.గత కొంతకాలంగా రక్షిత మంచినీటి పథకం మరమ్మతుకు గురి కావడంతో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. మంచినీటి పథకాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, పంచాయితీ కార్యదర్శి జ్యోతి రెడ్డి తదితరులు తెలిపారు.



ట్రెకింగ్ క్యాంపులో విద్యార్థులు

స్కౌట్స్, గైడ్స్ విద్యార్థుల ట్రెక్కింగ్ క్యాంప్

ప్రజాశక్తి-రోలుగుంట:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు ట్రెక్కింగ్ క్యాంప్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ట్రెక్కింగ్ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు టివి.శేషగిరిరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, స్కౌట్ మాస్టర్ గోవింద్, ఆంగ్ల ఉపాధ్యాయురాలు, గైడ్ కెప్టెన్ పివిఎం.నాగజ్యోతి నాయకత్వం వహించారు.ట్రెక్కింగ్ మార్గంలో విద్యార్థులు ప్రకృతి ఒడిలో సేదతీరుతూ ఆనందంగా ప్రయాణం కొనసాగించారు. అనంతరం నిర్వహించిన వనభోజనాల్లో పాల్గొని విజయవంతంగా ముగించారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ:విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుద్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఉపాధి హామీ సామాజిక తనిఖీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయన్నారు.

గంగాలమ్మ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సాలికమల్లవరం గ్రామంలో సర్పంచ్ పెదిరెడ్ల నూకరత్నం, అప్పలనాయుడు ఆధ్వర్యంలో బుధవారం గంగాలమ్మ తల్లి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జొన్నలోవ, పెదిరెడ్ల రాము తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి ప్రగడ సత్య దుర్గా రాకేష్ జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం విజయ తెలిపారు.ఈ నెల 22 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు తిరుపతి జిల్లా,చంద్రగిరి లో జరిగిన అండర్ -14 బాలుర విభాగం, రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో సత్య దుర్గా రాకేష్ ప్రతిభ కనబరచడంతో, డిసెంబర్ 22 నుండి మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ ఎం వెల్లడించారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థిని హెచ్ఎం విజయ తోపాటు, ఉపాధ్యాయులు టి. వి. రమణ, పి.వరలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు నీరజ, ధనలక్ష్మి అభినందించారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

మేకా సూరిబాబుకు ఘన నివాళి

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని పాతకృష్ణదేవి పేట గ్రామంలో కామ్రేడ్ మేకా సూరిబాబు 38వ వర్ధంతి సందర్భంగా సిపిఐ గొలుగొండ మండల సమితి ఆధ్వర్యంలో స్థూపం వద్ద ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు బాలేపల్లి వెంకటరమణ, సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, మేకా సత్యనారాయణ, ఎం.గంగా భవాని, ఎల్వి.రమణ మాట్లాడుతూ, పేద ప్రజల పక్షాన నిలబడి సిపిఐ ఎర్రజెండా చేత పట్టుకొని పోరాటాలు చేశారని కొనియాడారు.

సిపిఐ మండల కార్యదర్శి జి.రాధాకృష్ణ మాట్లాడుతూ మేకా సూరిబాబు నిరంతరం ప్రజల పక్షాన ఉద్యమాలు చేశారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మేకా భాస్కరరావు, మండల మహిళా సమాఖ్య భవాని, ఆడాకుల సర్పంచ్ సత్యనారాయణ, పెదబాబులు, సతీష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి స్నేహాలతకు హోం మంత్రి అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి:జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతిలో బుధవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్న నక్కపల్లి గురుకులం విద్యార్థి స్నేహాలతను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు యువతలో నాయకత్వ నైపుణ్యాలు, పార్లమెంటరీ వ్యవస్థపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థుల ఆత్మవిశ్వాసం, ప్రతిభ చూసి ఎంతో గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో స్నేహాలత మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.



స్నేహాలత తో హోం మంత్రి

మోడల్ స్కూల్‌ను ఆశ్రమ పాఠశాలగా మార్చాలి

ప్రజాశక్తి:రావికమతం:మండలంలో జెడ్. జోగింపేట మోడల్ పాఠశాలను గిరిజన ఆశ్రమ పాఠశాలగా మార్పు చేయాలంటూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నేరేడు బంధ ఆదివాసి గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు కే గోవిందరావు మాట్లాడుతూ, రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ లో శివారు గ్రామాలతోపాటు సమీపంలో, రోలుగుంట మండలానికి చెందిన సుమారు 80 గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ గ్రామాల విద్యార్థులు చదువుకోవాలంటే ప్రతిరోజు నాలుగు, ఐదు కిలోమీటర్లు మేర పాఠశాలలకు గుర్రాల పై వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. చీమలపాడు పంచాయతీ జెడ్.జోగింపేట పాఠశాల లో 70 మంది గిరిజన విద్యార్థులు ఉండడంతో ఇటీవల ఈ పాఠశాలను మోడల్ స్కూల్ గా మార్పు చేయడం జరిగిందన్నారు. ఈ పాఠశాలలో పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతిరోజు 6 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లవలసిన పరిస్థితి ఉందన్నారు. నేడుబంధ గ్రామానికి చెందిన 13 మంది గిరిజన విద్యార్థులు రాలపై పాఠశాలకు వెళ్తా ఉంటారన్నారు.ఆదివాసి గిరిజనులకు గుణాత్మకమైన విద్యను అందించాలంటే జడ్.జోగింపేట మోడల్ స్కూల్‌ను ఆశ్రమ పాఠశాలగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కిలో సూరిబాబు, కిలో పొట్టి దొర, చరణ్ , తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు, పెద్దలు, చిన్నారులు

'ఇఫి'లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధుల సందడి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ:భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పే ప్రతిష్టాత్మక 56వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫి) గోవాలో అంగరంగ వైభవంగా జరుగుతోంది. ఈ ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు హాజరై సందడి చేశారు. ఈ నెల 20 నుండి 28 వరకు జరుగుతున్న ఈ చలన చిత్రోత్సవంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు ఎ.కాశీ విశ్వేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి బి.చిన్నారావు, లైఫ్ మెంబర్ ఆర్.శివాజీ పాల్గొని తెలుగు సినిమా ప్రాతినిధ్యాన్ని చాటిచెప్పారు. ఈ చిత్రోత్సవంలో సుమారు 81 దేశాల నుంచి 240కిపైగా చిత్రాలు ప్రదర్శితమవుతుండగా, మొత్తం పది ఐనాక్స్ థియేటర్లలో దాదాపు 300 సినిమాలు స్క్రీనింగ్ అవుతున్నాయి. వీటిలో తెలుగు సినిమా జెండాను ఎగురవేస్తూ 'ఇండియన్ పనోరమా' విభాగంలో 'కమిటీ కుర్రాళ్లు' (ఉత్తమ పరిచయ దర్శకుడు విభాగంలో నామినేట్ అయింది), 'సంక్రాంతికి వస్తున్నాం' 'మల్లీశ్వరి' వంటి ప్రముఖ చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. చిత్రోత్సవానికి సినీ దిగ్గజాలు సుహాసిని, అనుపమ్ ఖేర్, కమలహాసన్, బాలకృష్ణ వంటి పలువురు సినీ ప్రముఖులు హాజరై వేడుకకు మరింత శోభను తీసుకొచ్చారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు ఈ అంతర్జాతీయ వేదికను సద్వినియోగం చేసుకుని పలువురు హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్ ప్రముఖులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులతో సమావేశమయ్యారు. ఈ చర్చలు తెలుగు సినిమాకు అంతర్జాతీయ సహకారాన్ని పెంచడానికి, సాంకేతిక పరిజ్ఞానం పంచుకోవడానికి, చలనచిత్ర నిర్మాణంలో కొత్త అవకాశాలను అన్వేషించడానికి ఉపయోగపడతాయని భావిస్తున్నారు. ప్రతినిధులు చిత్రోత్సవంలో ప్రదర్శితమవుతున్న వివిధ భాషల జాతీయ, అంతర్జాతీయ చిత్రాలను వీక్షించారు. అన్ని సినిమాల వివరాలను, స్క్రీనింగ్ షెడ్యూల్‌ను యాప్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నారు.



చిత్రోత్సవానికి హాజరైన వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం పిలుపునిచ్చారు. బుధవారం అచ్యుతాపురం అచ్యుత కళాశాలలో హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పలు అంశాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. తల్లిదండ్రులు గురువులు చెప్పిన విధంగా నడుచుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, సెల్‌ఫోన్ల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఆర్ లక్ష్మి, అచ్యుత కళాశాల వ్యవస్థాపకులు పల్లి శేషగిరిరావు, ఉపాధ్యాయులు సోనీ, ప్రసన్న పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు నిర్మాణానికి శంకుస్థాపన

- నేషనల్ హైవే అథారిటీ సిఎస్ఆర్ నిధులతో బాలికలకు సైకిళ్లు



బాలికలకు సైకిళ్లు పంపిణీలో ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి -సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం పంచాయతీ చిన్నయ్యపాలెం దరి జాతీయ రహదారి 16ను ఆనుకొని కూరగాయలు మార్కెట్ యార్డ్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతులకు వారు పండించిన కూరగాయలను మార్కెట్లో అమ్ముకొనడానికి వీలుగా నాబార్డ్ నిధులు రూ.20 లక్షలతో మార్కెట్ యార్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ నుంచి రూ.ఐదు లక్షలు, మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.పదిహేను లక్షలు నిధులు నాబార్డు మంజూరుచేసిందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై గ్రామ సర్పంచ్ బోకం స్వామినాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ బి చిన్నకృష్ణ, ఎంపిడిఓ పి. పద్మజ, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్. గోపాల్, డిడిఎం సమంత కుమార్, జాగృతి ఎం డి కందర్ప సుజాత పాల్గొన్నారు..

బాలికలకు సైకిళ్లు పంపిణీ

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ నిధులతో సమకూర్చిన 426 సైకిళ్లను విద్యార్థినులకు ఎమ్మెల్యే పంచకర్ల, కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా పంపిణీ చేశారు. సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలకు 306, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థినులకు 68, మల్లు నాయుడుపాలెం హైస్కూల్ విద్యార్థులకు 27, రావులమ్మపాలెం హై స్కూల్ విద్యార్థులకు20, తవ్వవాని హై స్కూల్ విద్యార్థులకు 5 సైకిళ్లను అందజేశారు. ఎంపిపి బోకం సూర్య కుమారి,స్పెషల్ ఆఫీసర్ కె.రమామణి, నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోహిత్‌కుమార్, డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు పాల్గొన్నారు.